క్లుప్తంగా

ముదిరాజ్ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



నూతన సభ్యులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని రావిర్యాల గ్రామ కొంగరఖుర్దు ముదిరాజ్ సంఘం గ్రామ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా నర్సింహా ముదిరాజ్, ఉప అధ్యక్షులుగా దర్శన్ ముదిరాజ్, బాల్‌రాజ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా రాజు ముదిరాజ్, కోశాధికారిగా విజయ్ కృష్ణ ముదిరాజ్, కార్యవర్గ సభ్యులుగా శేఖర్ ముదిరాజ్, భిక్షపతి, వెంకటేష్ ముదిరాజ్, మహేందర్ ముదిరాజ్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తామన్నారు.

యోగాతో ఆరోగ్య సమాజం



యోగా చేస్తున్న విశాల్ సంజీవని కాలనీ వాసులు, చిన్నారులు

తుక్కుగూడ: యోగాతో ఆరోగ్య సమాజం నిర్మితమవుతుందని భారత స్వాభిమాన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీధర్‌రావు పేర్కొన్నారు. 9వ అంతర్జాతీయ యోగా డే సందర్భంగా కేంద్ర ఆయుష్ శాఖ, మొరార్జీదేశాయ్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ యోగా యూనివర్సిటీ సహకారంతో మున్సిపల్ పరిధిలోని విశాల్ సంజీవని రెసిడెంట్ కమ్యూనిటీ ప్రాంగణంలో యోగా వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగా ధర్మం పాటిస్తేనే రోగాల మత్తు నుంచి రక్షణ దొరుకుతుందన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా అందరూ యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ పద్మ, తేజస్విని, విశ్వ హిందూ పరిషత్ సభ్యులు వెంకట్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ ఆలయంలో భోజనాలు



భక్తులకు భోజనం పెడుతున్న దాతలు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ మండల కేంద్రంలోని బంగారు మైసమ్మ కాశీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య భోజనాలు ఏర్పా టు చేశారు. ఆలయంలో అన్నదానం ప్రారంభించి 413రోజులు అవుతోందని, అమావాస్యను పురస్క రించుకొని పేదలకు అన్నదానం చేసినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ ఆకుల అరవింద్ కుమార్ తెలిపారు. సరూర్‌నగర్ గోల్డెన్ వాకర్స్ టీం ఆర్యవైశ్య సభ్యులు ఆలయంలో 500మంది భక్తులకు అన్నదానం చేశా రని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ బాలకిషన్, ఆర్యవైశ్య సంఘం నాయకులు నగేష్‌గుప్తా, అంజయ్యగుప్తా, నీలా అమృతరాజు, ప్రభాకర్‌గుప్తా, వీరయ్య గుప్తా, గౌరీశంకర్‌గుప్తా, ఎల్ఐసీ డెవలప్‌మెంట్ అధికారి ఆనంద్‌గుప్తా పాల్గొన్నారు.

తుది దశకు జల్‌పల్లి పార్కు



పార్కులో ఏర్పాటు చేస్తున్న క్రీడా పరికరాలు

- త్వరలో అందుబాటులోకి రానున్న సుందర వనం
- నాలుగేళ్ల శ్రమకు ఫలితం

పహాడీషరీఫ్: జల్‌పల్లి అర్బన్ ఫారెస్ట్ పార్కు త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది. 65ఎకరాల విస్తీర్ణంలో నాలుగేళ్ల క్రితం నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరగడంతో ఈ పార్కు సుందర వనాన్ని తలపిస్తోంది. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో పార్కులు లేకపోవడంతో వ్యాయామం చేసేందుకు ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో జల్‌పల్లి పార్కులో సదుపాయాలు కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మంత్రి సబితారెడ్డి శ్రీకారం చుట్టారు. ఐదు రోజుల క్రితం మున్సిపాలిటీ అధికారులు, పాలక మండలితో కలిసి ఈ అర్బన్ ఫారెస్ట్‌లో పర్యటించి చేపట్టాల్సిన అభివృద్ధి పనుల విషయమై స్వయంగా పరిశీలించారు.

వ్యాయాయం, ఆట విడుపునకు అనుగుణంగా..

శ్రీశైలం హైవేను ఆనుకొని జల్‌పల్లి కమాన్ వద్ద సువిశాల విస్తీర్ణంలో ఉన్న అర్బన్ పార్కును ప్రజలకు నడక, ఆట విడుపుగా కూడా ఉండేలా అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించేలా మున్సిపాలిటీ అధికారులు సిద్ధమయ్యారు. ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానిక పరిసరాల ప్రజలు నడక కొనసాగేలా వాకింగ్ ట్రాక్, వ్యాయామం కోసం ఓపెన్ జిమ్, సాయంత్రం పూట చిన్నారుల ఆట విడుపు కోసం ఆట పరికరాల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. వీటితో పాటు మున్సిపాలిటీ తరఫున పార్కు బాగోగులు చూసుకునేందుకు ఒక వ్యక్తిని సైతం నియమించనున్నారు.



పార్కులో ల్యాన్ ఏర్పాటు పనులు

ఆ చెట్లను తొలగించి..

జల్‌పల్లి కమాన్ పక్కన ఉన్న అటవీ ప్రాంతంలో ఒకప్పుడు భారీగానే పెరిగిన జిందా తిలస్ చెట్లు.. ముళ్లపొదలు ఉండేవి. కానీ ఈ చెట్ల నుంచి ఆశించిన స్థాయిలో నీడ రాకపోవడం.. చెట్ల ఆకులు సైతం రాలి ఒకదానిపై ఒకటి పడి వర్షపు నీటిని భూమిలోకి ఇంకకుండా అడ్డుగా ఉండేవి. ఈ నేపథ్యంలోనే కొత్త చెట్లు నాటాలన్న ఉద్దేశంతో 2019 జూలై మాసంలో హరితహారంలో భాగంగా ఈ జిందాతిలస్ చెట్లను పూర్తిగా నరికేశారు. వాటి స్థానంలో ఆరోగ్యానికి అవసరపడే అతరించిపోతున్న మొక్కలను నాటిన అధికారులు వాటికి జీవం పోశారు. చిన్న చిన్న వర్షాలు.. ఈదురు గాలులకు కూలే చెట్లను కాకుండా ఎక్కువ కాలం మన్నిక.. ప్రజలకు నీడ నిచ్చే చెట్లైన 'మర్రి, రావి, జువ్వి, మేడి, మద్ది, వేప, రోజ్‌వుడ్, కానుగ, నెమిలి నార, ఇప్ప, వెలగ, నారేప' తదితర అరుదైన వాటిని పెంచారు. ఈ చెట్లు సీజనల్‌గా కాసే పండ్లను తినేందుకు వివిధ రకాల పక్షులు, కోతులు కూడా వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు వెల్లడిస్తున్నారు. నగరీకరణకు అలవాటుపడ్డ నేటి తరం పిల్లలకు పక్షులన్నా.. గూళ్లు అన్నా ఇంటర్నెట్‌లో చూసే పరిస్థితి తలెత్తిందని.. అలాంటి వాటిని పోగొట్టే ప్రయత్నం చేస్తున్నామని అటవీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

అటవీ ప్రాంతం కబ్జాకు చెక్

గతంలో ఈ అటవీ ప్రాంతానికి రక్షణ గోడ లేని కారణంగా ఎక్కడికక్కడ కబ్జాలు.. ఎక్కడెక్కడో.. ఎవరెవరినో చంపి మృతదేహాలను జల్‌పల్లి కమాన్ రోడ్డులోనే పడేసి వెళ్లేవారు. చనిపోయిన పశువులను కూడా ఇక్కడే పడేస్తుండడంతో ఈ ప్రాంతమంతా జుగుప్సాకరంగా ఉండేది. దీంతో పాటు అసాంఘిక శక్తులు, గంజాయి, వైట్నర్లు పీల్చేవారు కూడా ఇందులోనే దూరేవారు. ఇలాంటి పరిణామాలకు చెక్ పెడుతూ కబ్జాకు గురైన భూములను కూడా స్వాధీనం చేసుకున్న అధికారులు పచ్చదనాన్ని పెంపొందించాలన్న ఉద్దేశంతో నాలుగేళ్ల క్రితమే హరితహారంలో భాగంగా రూ. 2కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. కొత్తగా 45 వేల మొక్కలను నాటడంతో పాటు రక్షణ గోడ, రక్షణ జాలీ ఏర్పాటు చేసి ఈ అటవీ ప్రాంతాన్ని అహ్లాదకర వాతావరణానికి అనువైనదిగా మార్చారు.

> **హరిత లక్ష్యం అందుకుంటాం**
>
> 
>
> ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో విజన్‌తో చేపట్టిన హరిత హారం కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. జల్‌పల్లి కమాన్ రోడ్డులో ఆరోగ్యకరమైన చెట్లతో కూడిన అర్బన్ ఫారెస్ట్ పార్కులో ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. స్వచ్ఛమైన వాతావరణంలో వాయు కాలుష్యానికి తావులేని ఈ పార్కులో ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో నడక కొనసాగించేలా వాకింగ్ ట్రాక్, చిన్నారుల ఆట పాటల కోసం అవసరమైన పరికరాలు కూడా కల్పిస్తాం.
>
> – సబితారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి

తాగునీటిని వృథా చేయొద్దు: మేయర్



ఇంకుడు గుంతలో ఇసుక పోస్తున్న మేయర్ దుర్గ తదితరులు

మీర్‌పేట: మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ ఎం.దుర్గా దీప్‌లాల్ చౌహాన్ తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జలమండలి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మంచినీళ్ల పండుగ కార్యక్రమానికి మేయర్ ముఖ్యఅతిథిగా హాజరై బైకు ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బీఎన్‌రెడ్డినగర్‌లోని రిజర్వాయర్ నుంచి జిల్లెలగూడ వరకు జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నీరు ప్రాణాధారమైందని, వెలకట్టలేనిదని వృథా చేయరాదన్నారు. జలమండలి సిబ్బంది 24 గంటల కృషి వల్లే కాలనీలకు సమృద్ధిగా తాగునీరు అందుతోందని తెలిపారు. భూగర్భ జలాల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం ఇంకుడు గుంత పునఃనిర్మాణ పనులను పర్యవేక్షించి జలమండలి అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అదే విధంగా జలమండలి సిబ్బందిని ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలోని మీర్‌పేటతో పాటు అన్ని మున్సిపాలిటీలు, గ్రామాలలో మంత్రి సబితారెడ్డి కోట్లాది రూపాయలు మంజూరు చేయించి నూతన లైన్లు వేయించి మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి సీజీఎం అమరేందర్‌రెడ్డి, జీఎం శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎంలు హరీష్, గోవింద్‌గౌడ్, మేనేజర్లు వివేక్, ప్రమోద్, ప్రియాంక, గోపాల్, సాజిత్‌అలీ, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ చైర్మన్ టి.సురేందర్, కార్పొరేటర్లు బాలమణి, సిద్దాల పద్మ పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు: మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ముచ్చర్లలో మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించాలని, నెలకు రూ. 26 వేతనం ఇవ్వాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాని, గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్, హెల్త్‌కార్డులు, రక్షణ పరికరాలు, అలవెన్స్‌లు, బోనస్, వారాంతపు సెలవులు, 8 గంటల పని విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు జనార్దన్, యాదయ్య, రాములు, రవి, జంగయ్య, నర్సింహా, శ్రీను, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు, కార్మికులు

ప్రజా సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం



28వ డివిజన్ కాలనీవాసులతో శ్రీరాములు యాదవ్

బడంగ్‌పేట్: స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తెస్తే బీఆర్ఎస్ నేతలు వేధింపులకు గురిచేస్తున్నారని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఏ శ్రీరాములు యాదవ్ మండిపడ్డారు. ఆదివారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు పర్యటించారు. ప్రజలు, కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు కాలనీల్లో రోడ్డు, డ్రైనేజీ, అవుట్‌లెట్ చెత్త తొలగింపు లేక నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. అభివృద్ధి కోసమని కాంగ్రెస్‌ను వీడి కారెక్కిన మంత్రి సబితారెడ్డి, కారు వీడి హస్తం గూటికి చేరిన మేయర్ పారిజాత ప్రజల అవసరాల కోసం ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పట్టించుకోవడం మానేసి ప్రచారాలకే పరిమితం అయ్యారని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, 28వ డివిజన్ బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ చిత్రం శ్రీను, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడ ఇందిరనగర్ కాలనీలో ఆదివారం మేయర్ పారిజాత పర్యటించారు. అక్కడ సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పనుల్లో నాణ్యత, మన్నిక ఉండేలా చొరవ తీసుకోవాలని అధికారులను కోరారు. ఇందిరనగర్ కాలనీవాసులు పలు సమస్యలు మేయర్ దృష్టికి తీసుకురాగా దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, బాలునాయక్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, అంజి, జంపయ్య, వెంకటేష్, కుమారి, జ్యోతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరిచ్చిన ఘనత కేసీఆర్‌దే

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

మంచాల: గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇంటింటికి తాగునీటిని అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. దశబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన మంచి నీళ్ల పండుగ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ వద్ద మహిళలతో కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అక్కడి నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పాలకుల హయాంలో నల్లా నీళ్లు ఎప్పుడు వస్తాయో తెలిసేది కాదన్నారు. నీళ్ల కోసం కాలనీ వాసులు ఖాళీ బిందెలతో తగవులాడుకునే వారని గుర్తు చేశారు. జరుగుతుందన్నారు.మహిళలు ఖాళీ బిందెల్లతో రోడ్ల మీదకు రాకుండా చర్యలు తీసుకోవడంతో మహిళ లోకం బీఆర్ఎస్ వైపు ఉన్నారని గుర్తు చేశారు. తాగు నీరే కాదు భవిష్యత్‌లో సాగు నీరు కూడా తీసుకొని వచ్చె దిశగా కృషి చేస్తామన్నారు. మంచాల గ్రామ అభివృద్ధికి రూ.10లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకట రమణారెడ్డి, ఎంపీపీ నర్మద, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏ చంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, నాయకులు జంగారెడ్డి, రఘుపతి, కిషన్ రెడ్డి, రాజు, జానీపాష, భద్రినాథ్ గుప్తా, శంకర్, రాజేష్, సైదులు, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ అనిత, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు

మంత్రి సహకారంతో మరింత అభివృద్ధి: ఎంపీపీ



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ రఘుమారెడ్డి

మహేశ్వరం: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎంపీపీ కే రఘుమారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని 10 వార్డులో రూ. 10లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి సహకారంతో మండలాన్ని మరింత అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునితా నాయక్, ఎంపీటీసీ సుదర్శన్ యాదవ్, శివగంగ ఆలయ కమిటీ డైరెక్టర్ చంద్రయ్య ముదిరాజ్, మాజీ సర్పంచ్ యాదయ్య, మాజీ ఉప సర్పంచ్‌లు రాములు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శిగా యాదీలాల్

ఆమనగల్లు: టీడీపీ రాష్ట్ర లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శిగా కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌చార్జ్, ఆమనగల్లు మండలం కోనాపూర్‌కు చెందిన సీనియర్ న్యాయవాది యాదీలాల్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ ట్రస్టు భవన్‌లో ఆదివారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ టీడీపీ రాష్ట్ర లీగల్‌సెల్ కార్యవర్గాన్ని నియమించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా యాదీలాల్‌ను నియమించినట్లు ప్రకటించారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గంలో టీడీపీ బలోపేతానికి కృషి చేస్తున్న యాదీలాల్‌ను రాష్ట్ర నాయకత్వం గుర్తించి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో యాదీలాల్‌కు కాసాని నియామకం పత్రం అందజేశారు. పార్టీ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రసన్న, జిల్లా నాయకులు మల్లయ్య, పంచాక్షరి, సత్యం, నర్సింహా, భాస్కర్, కుమార్‌గౌడ్, శ్రీధర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

పీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాత

పహాడీషరీఫ్: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీకి చెందిన ఆజాద్ యూత్, బాలగణేష్ యూత్‌లకు సాయి కిరణ్, పవన్‌తో పాటు మరో 80 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం ఆమె మాట్లాడారు. కర్ణాటక ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ రోజు రోజుకూ బలోపేతం అవుతుందన్నారు. భట్టి విక్రమార్క చేపట్టిన యాత్రకు ప్రజాదరణ పెరుగుతూ వస్తోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే నిరుపేదలకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పీ సుదర్శన్‌రెడ్డి, నేనావత్ బాలునాయక్, రాఘవేందర్ రెడ్డి, అబ్దుల్‌బారీ, శ్రీనివాస్‌రెడ్డి, సాధిక్ మహ్మద్, ఉబేద్ షరీఫ్, భాస్కర్‌రెడ్డి, నవీన్ గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



యువకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మేయర్ పారిజాత

సీఎం పర్యటనను సక్సెస్ చేద్దాం

మంత్రి సబితారెడ్డి



సర్దార్‌నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహేశ్వరం నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి సబితారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ, సర్దార్‌నగర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజల అవసరాలు తెలుసుకొని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. సర్దార్ నగర్ వాసుల్లో అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు సుమన్, బోధ, రవినాయక్, డీఈఈ యాదయ్య, ఏఈఈ కె.భార్గవ్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు లక్ష్మయ్య యాదవ్, నాయకులు రాజు, శ్రీకాంత్, బుచ్చిరెడ్డి, గడ్డి రాజు, నర్సింగ్‌గౌడ్, నర్సింహా, ప్రభుగౌడ్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం

కందుకూరు: మండలంలోని పులిమామిడి నిఖిల్ చేతనా కేంద్రంలో అమావాస్యను పురస్కరించుకుని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో ఆదివారం హోమం నిర్వహించారు. పూర్ణాహుతి నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, ఆశీర్వాదంతో పాటు అన్నదానం చేశారు.



ప్రవచనాలు చేస్తున్న అనిల్‌కుమార్ జోషి

అపరిశుభ్రతకు నిలయం ఆ రహదారి



జల్‌పల్లి కమాన్ రోడ్డు పక్కన పడేసిన వ్యర్థాల మూటలు

పహాడీషరీఫ్: జల్‌పల్లి కమాన్ రహదారి మళ్లీ అపరిశుభ్రతకు నిలయంగా మారుతోంది. ఆరేళ్ల క్రితం వరకు ఈ రహదారిపై ఎక్కడ చూసినా జంతు కళేబరాలు, చికెన్, ఇతర వ్యర్థాలతో కూడిన సంచుల మూటలే దర్శనమిచ్చేవి. క్రమేణా అధికారులు చర్యలు చేపట్టడంతో ఈ రహదారిపై వ్యర్థాల పారబోతకు బ్రేక్ పడింది. తిరిగి కొన్ని రోజులుగా వ్యర్థాల మూటలు రోడ్డు పక్కన కనిపిస్తుండడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కమాన్ నుంచి మొదలుకొని కిలో మీటర్ మేర వ్యర్థాల సంచులను పడేశారు. ఇక చెరువు కల్వర్ట్ పక్కనే పడేసిన జంతు కళేబరం నుంచి వస్తున్న దుర్వాసనతో వాహనదారులు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. జల్‌పల్లి కమాన్ నుంచి డేసీ దాబా వరకు 2.5 కిలోమీటర్ల పొడవులో పూర్తి గోతుల మయం, ఇరుకుగా ఉన్న రహదారిని మంత్రి సబితారెడ్డి రూ.2 కోట్ల నిధుల వ్యయంతో బాగు చేయించారు. రహదారిని విస్తరించి కొత్తగా బీటీ రోడ్డు వేసి అందుబాటులోకి తీసుకురావడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక జల్‌పల్లి కమాన్ రోడ్డులో సాఫీగా రాకపోకలు సాగుతాయని భావించిన వారికి మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్య ధోరణి వేదన కలిగిస్తుంది. ఈ రహదారిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వ్యర్థాలు పడేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటే ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టినట్ల అవుతుందంటున్నారు. అంతవరకు మున్సిపాలిటీ సిబ్బంది కాపలా కొనసాగేలా చూడాలంటున్నారు.



రోడ్డు పక్క పశు కళేబరం

> **చర్యలు తీసుకోవాలి**
>
> 
>
> కోట్లాది రూపాయలు వెచ్చించి జల్‌పల్లి మున్సిపాలిటీకి స్వాగత తోరణంగా ఉన్న కమాన్ రహదారి, పరిసరాలను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే.. మున్సిపల్ అధికారులేమో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదు. ఒకవైపు డబుల్ రోడ్డు.. మరో వైపు ఈ రోడ్డును ఆనుకునే ఉన్న పార్కుకు ప్రజలు సేద తీరేందుకు వెళుతున్న క్రమంలో రోడ్డుపై ఈ వ్యర్థాలు ఉండడం సరైంది కాదు. అధికారులు స్పందించి ఈ రహదారిపై వ్యర్థాలు వేయకుండా కఠినంగా వ్యవహరించాలి.
>
> – షేక్ అఫ్జల్, మాజీ ఎంపీటీసీ

మూటల ముసుగులో..

జల్‌పల్లి కమాన్ రోడ్డులో మూటల ముసుగులో పలుమార్లు మృతదేహాలను పడేసిన ఘటనలు సైతం నెలకొన్నాయి. 2018 సెప్టెంబర్ మాసంలో వ్యక్తిని దారుణంగా హత్య చేసి సంచిలో మూట కట్టి పడేసిన విషయం తెలిసిందే. ఇలాంటి ఘటనలతో ఇటు నుంచి రాకపోకలు సాగించాలంటే వాహనదారులు భయాందోళనలకు గురైన పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం అన్ని సద్దుమణిగిన వాతావరణం నెలకొంటున్న తరుణంలో ఇలాంటి మూటలు మళ్లీ పడేయడకుండా పోలీసులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దీంతో పాటు మరి కొన్ని రోజుల్లో ఈ రహదారిని ఆనుకొనే కిలోమీటర్ పొడవులో ఉన్న జల్‌పల్లి అర్బన్ ఫారెస్ట్ పార్కు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో.. అపరిశుభ్రతకు చెక్ పెట్టకపోతే ప్రజలు ఎలా వస్తారన్న విషయాన్ని అధికారులు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.